ఏపీ గిరిజన యూనివర్సిటీ అధికారులతో మాట్లాడుతున్న తెలంగాణ యూనివర్సిటీ వీసీ

గిరిజన యూనివర్సిటీలో ప్రత్యేక కోర్సులు

ములుగు, మార్చి 25 (నమస్తే తెలంగాణ) : జిల్లాలోని సమ్మక్క–సారలమ్మ కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయంలో విద్యార్థుల సౌకర్యార్థం ప్రత్యేక కోర్సులు ప్రవేశపెట్టనున్నట్లు వైస్ చాన్స్‌లర్ డాక్టర్ వైఎల్ శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం ఆయన యూనివర్సిటీ నోడల్ ఆఫీసర్ వంశీకృష్ణారెడ్డితో కలిసి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విజయనగరం జిల్లాలోని ఆంధ్రప్రదేశ్ గిరిజన యూనివర్సిటీని సందర్శించారు. ఆంధ్రలో యూనివర్సిటీ ఏర్పాటు చేసి ఐదేళ్లు పూర్తి కావస్తున్నందున అక్కడ విద్యార్థులకు అందిస్తున్న కోర్సులు, విద్యావసతులు, భవన నిర్మాణాలు, ఇతర అంశాలపై అక్కడి అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ రెండు రాష్ట్రాల్లో ఏర్పాటు చేసిన గిరిజన యూనివర్సిటీలు ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాల్లో ఏర్పాటయ్యాయన్నారు. ప్రస్తుతం ఆంధ్రా యూనివర్సిటీలో నాలుగేళ్లుగా తరగతులు కొనసాగుతున్నాయని, అక్కడ అందుతున్న కోర్సులతో పాటు సౌకర్యాలను పరిశీలించి ములుగు యూనివర్సిటీలో ఏర్పాటు చేసేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నట్లు తెలిపారు. అమర్‌టంక్ వీసీగా పనిచేసిన ప్రొఫెసర్ కేటీ కట్టమణి ఆంధ్ర యూనివర్సిటీలో ప్రస్తుతం పనిచేస్తున్నారని, ఆయనతో అన్ని విషయాలు చర్చించి యూనివర్సిటీ అభివృద్ధి కోసం కావాల్సిన ఏర్పాట్లను కేంద్ర ప్రభుత్వానికి నివేదించనున్నట్లు తెలిపారు.

ముందస్తు అరెస్ట్‌లు దారుణం

మంగపేట : పోలీస్ స్టేషనలో వీవోఏలు

మహదేవపూర్ (కాళేశ్వరం) మార్చి 25 : ఆరు నెలులుగా జీతాలు రాక, పాత బకాయిలను ప్రభుత్వం విడుదల చేయకపోవడంతో మంగళవారం కార్మికులు తలపెట్టిన ఛలో హైదరాబాద్ కు వెళ్తున్న తమను పోలీసులు ముందుస్తు అరెస్ట్ చేయడం దారుణమని కార్మికులు అన్నారు. మండలకేంద్రంతో పాటు కాళేశ్వరం జీపీ కార్మికులను, ఐకేపీ సిబ్బందిని పోలీసులు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ ప్రభుత్వం తమపై కక్ష సాధింపు చర్యలు మానుకోవాలని, పెండింగ్‌లో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. అరెస్టయిన వారిలో మండల అధ్యక్షుడు ఠాకూర్ కేసర్ సింగ్, కారోబార్ గరిగె రమేశ్, ఐకేపీ వీవోఏలు శ్రీశైలం, ప్రవంతి, సృజన్, కాళేశ్వరం కారోబార్ సాయి, రమ, పంప్ ఆపరేటర్, జీపీ సిబ్బంది ఉన్నారు.

మంగపేటలో వీవోఏలు..

మంగపేట : హైదరాబాద్‌లోని ఇందిరా పార్కు వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించతలపెట్టిన ధర్నాకు వెళ్లకుండా మండలానికి చెందిన పలువురు వీవోఏ లను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. అరెస్టు అయిన వారిలో వీ వసంత, డీ గణేశ్‌బాబు, రమేశ్, ఎల్లయ్య, కల్పన, రాధ, జయలక్ష్మి, సంధ్య ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో తాత మృతి

మనుమడికి తీవ్రగాయాలు

మొగుళపల్లి, మార్చి 25 : రోడ్డు ప్రమాదంలో తాత మృతి చెందగా, మనుమడికి తీవ్ర గాయాలైన ఘటన మండలకేంద్రం శివారు పెద్ద వాగు బ్రిడ్జి సమీపంలో మంగళవారం సాయంత్రం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. చిట్యాల మండలం చింతకుంటరామయ్యపల్లి గ్రామానికి చెందిన మోత్కూరి రాములు (60) తన మనుమడు మణిదీప్‌ను మొగుళ్లపల్లి మండలం ముల్కలపల్లి గ్రామంలోని అమ్మమ్మ ఇంటి వద్ద దించేందుకు ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. ఈ క్రమంలో వారు మాట్లాడుకుంటూ వస్తుండగా స్కూటర్‌ను లారీ ఢీకొట్టింది. తాతా, మనుమడు ఎరిపడి మొగుళ్లపల్లి– జమ్మికుంట ప్రధాన రహదారిపై పడగా రాములు అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు వెంటనే 108కు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని మృతదేహాన్ని, తీవ్ర గాయాలైన మణిదీప్‌ను చిట్యాల సామాజిక దవాఖానకు అంబులెన్స్‌లో తరలించారు. బాలుడి పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎం దవాఖానకు తరలించారు. రాములు కొడుకు నాగరాజు నాలుగేళ్ల క్రితం మృతి చెందడంతో కోడలు మౌనిక ముల్కలపల్లిలో ఉంటున్నది.

నీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలి

భూపాలపల్లి కలెక్టర్ రాహుల్‌శర్మ

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌శర్మ

భూపాలపల్లి రూరల్, మార్చి 25 : వేసవిలో తాగు, సాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని కలెక్టర్ రాహుల్‌శర్మ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఐడీవోసీ కార్యాలయంలో వివిధ అంశాలపై ఆయా శాఖల అధికారులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. అధికారులు గ్రామాల్లో పంచాయతీ సెక్రటరీల ద్వారా పరిశీలించి నివేదికలు తయారు చేయాలని, మండల స్థాయిలో సమావేశం ఏర్పాటు చేసి తాగు నీటి సమస్యపై నివేదికలు ఇవ్వాలన్నారు. ఎక్కడైనా తాగు నీటి సమస్య తలెత్తితే అధికారులు ముందుగానే ప్రజలకు సమాచారం ఇవ్వాలన్నారు. కాలువలు, చెరువుల కింద సాగవుతున్న పంటలకు నీందించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఉపాధి కూలీలకు పనిదినాలు కల్పించాలని, వారికి ఐదు రోజుల్లో డబ్బు చెల్లించాలన్నారు. ఎక్కువ మందికి పని కల్పించాలని, ఎంపీడీవోలు, పంచాయతీ సెక్రటరీలను సమన్వయం చేస్తూ టార్గెట్ పూర్తి చేయాలన్నారు. సెగ్రిగేషన్ షెడ్లను ఉపయోగంలోకి తీసుకురావాలని సూచించారు. మార్చి 31 వరకు ఎల్‌ఆర్ఎస్ డబ్బు చెల్లించిన వారికి 25 శాతం మాఫీ ఉంటుందని, ఫీజు చెల్లించిన వెంటనే అధికారులు వెరిఫికేషన్‌కు వెళ్లాలని ఆదేశించారు. కాటారం మండలంలో అత్యధిక దరఖాస్తులు ఉన్నాయని వెంటనే వాటిని పరిశీలించాలన్నారు. గ్రామ స్థాయిలో ఇంటి పన్నుల వసూలు చేయాలని, ఇప్పటి వరకు జిల్లాలో 91 శాతం వసూలు చేశారని, మిగిలినవి ఈనెల 31 వరకు పూర్తి చేయాలని ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం త్వరగా చేపట్టాలన్నారు. ఏప్రిల్ 1 నుంచి ప్రభుత్వం సన్న బియ్యం అందించనుందని తెలిపారు. నూతన రేషన్ కార్డుల దరఖాస్తులను క్షేత్ర స్థాయిలో పరిశీలించాలని, ప్రత్యేక టీమ్‌లను ఏర్పాటు చేసి క్షేత్ర స్థాయిలో వెరిఫికేషన్ పూర్తి చేయాలని ఆదేశించారు. అర్హులైన ప్రతి కుటుంబానికి నూతన రేషన్ కార్డు అందించాలని ఆదేశించారు. 'సబ్ కి యోజన – సబ్ కి వికాస్' కింద జిల్లా, మండల ప్రణాళికల రూపకల్పనపై కలెక్టర్ జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి పలు సూచనలు చేశారు. జిల్లా, మండల స్థాయిలో ప్రణాళికా రూపకల్పన ఎంతో కీలకమని, ఇందులో ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని సమర్థవంతమైన అభివృద్ధి చర్యలు చేపట్టాలని సూచించారు. సమావేశాల్లో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, డీపీవో నారాయణ రావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ నిర్మల, మిషన్ భగీరథ ఈఈ మణిక్యాలరావు, డీఆర్డీవో నరేశ్, ఇరిగేషన్ ఈఈలు, మండల ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎంపీవోలు పాల్గొన్నారు.

ప్రభుత్వ తీరుపై ఆశ వర్కర్ల నిరసన

చిట్యాల : అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇస్తున్న ఆశాలు

చిట్యాల/ కాటారం/ కృష్ణకాలనీ/ వాజేడు, మార్చి 25 : హైదరాబాద్‌లో శాంతియుతంగా అందోళన చేస్తున్న కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్ అక్రమ అరెస్ట్‌లు, లాఠీచార్జిని నిరసిస్తూ మంగళవారం ఆశా వర్కర్ల యూనియన్, సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చేలా చూడాలని అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రాలు అందజేశారు. వేర్వేరుగా జరిగిన కార్యక్రమాల్లో ఆశ వర్కర్లకు కనీస వేతనం రూ.18 వేలు ఇవ్వాలని, వారి ఉద్యోగ భద్రతను కల్పించాలని సీపీఎం చిట్యాల కార్యదర్శి చింతల రజనీకాంత్, ఆశా వర్కర్ల యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మెట్టుకొండ లక్ష్మి, సీఐటీయూ ములుగు జిల్లా నాయకుడు కొప్పుల రఘుపతిరావు డిమాండ్ చేశారు. మంగళవారం చిట్యాల మండల కేంద్రం, కాటారం అంబేద్కర్ కూడలి, భూపాలపల్లి అంబేద్కర్ సెంటర్‌లో ఆశ వర్కర్ల యూనియన్, సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఆశ వర్కర్లు రాధిక, స్వప్న, సరోజన, మానస, సాయివేద, సుమలత, కృష్ణవేణి, విజయ, కవిత, జ్యోతి, ప్రవంతి, రమ, కల్పన, భాగ్యలక్ష్మి, ప్రమీల సునీత, కోసరి జయప్రద, కుంభం రాజేశ్వరి, రమాదేవి, పద్మ, లత, స్వరూపరాణి, సమ్మక్క, లలిత, అరుణ, అంజు, నాగమణి, శైలజ, వసంత, కాంత, స్వరూప, సరిత, లక్ష్మి, సంధ్యారాణి, జ్యోతి, హేమలత, కవిత, రజిత, శారద, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఆకుదారి రమేశ్, నాయకులు రవి కుమార్, ఎం రాజేందర్, ఆశ వర్కర్లు కే స్వరూప, జ్యోతి, శారద, భాగ్యలక్ష్మి, దీప, సుమలత, సునీత, హైమావతి, రాజేశ్వరి, ఎన్ రజిత, లలిత, నల్లెబోయిన దేవి, శాంతకుమారి, వసంతలక్ష్మి, నారాయణమ్మ, మాలలి, రంభ, అక్కెమ్మ, శివకుమారి, అరుణ, మానస, ముత్తమ్మ పాల్గొన్నారు.

క్యాన్సర్ బాధితుడి కోరిక తీర్చిన మంత్రి దుద్దిళ్ల

నితిన్‌ను పరామర్శించి క్రికెట్ కిట్ అందజేస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

పలిమెల, మార్చి 25: 'సార్.. నాకు క్రికెట్ అంటే చాలా ఇష్టం. పెద్ద క్రికెటర్ కావాలని కళలుగన్నా.. నాకో క్రికెట్ కిట్ ఇప్పించండి' అంటూ క్యాన్సర్‌తో పోరాడుతున్న ఓ యువకుడు మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబును కోరడంతో వెంటనే తెప్పించి ఇచ్చాడు. వివరాలిలా ఉన్నాయి.. పలిమెల మండలం సర్వాయిపేటకు చెందిన భౌతు నితిన్ కాన్సర్‌తో బాధపడుతూ హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న మంత్రి ఆస్పత్రికి వెళ్లి పరామర్శించి నేనున్నానని భరోసానిచ్చారు. ఈ సందర్భంగా నితిన్ తనకు క్రికెట్ కిట్ ఇప్పించాలని కోరడంతో వెంటనే తెప్పించి ఇచ్చారు. ఏ అవసరమున్నా నేరుగా తనను సంప్రదించాలని నితిన్ తల్లిదండ్రులకు మంత్రి ధైర్యం చెప్పారు.

సింగరేణి బ్యారక్‌లు పరిశీలించిన జీఎం

కృష్ణకాలనీ, మార్చి 25 : జిల్లాకేంద్రంలోని ఫైలెట్ కాలనీలో సింగరేణి బ్యారక్‌లను మంగళవారం జీఎం రాజేశ్వర్‌రెడ్డితో పాటు అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీలో ప్రస్తుతం రేకుల షెడ్‌లో కొనసాగుతున్న జిల్లా గ్రంథాలయాన్ని నూతన భవనంలోకి త్వరలో మార్చనున్న నేపథ్యంలో ప్రస్తుతం కొనసాగుతున్న సింగరేణి వర్క్ షాప్ విస్తరణ పనుల్లో భాగంగా కార్మికుల కోసం ఏర్పాటు చేసిన బ్యారెక్‌లను మహిళ కార్మికుల వర్క్ షాప్ కోసం కేటాయిస్తామన్నారు. ప్రస్తుత బ్యారక్‌లు చిన్నగా ఉన్నాయని, నివాస యోగ్యానికి చాలా ఇబ్బంది ఏర్పడుతుందని పలువురు మహిళలు తన దృష్టికి తీసుకొచ్చారన్నారు. ఈ మేరకు రెండు బ్యాక్‌లను కలిపి ఒక క్వార్టర్‌గా మరమ్మతులు చేపడితే నివాసయోగ్యానికి ఉపయోగకరంగా ఉంటాయన్నారు. మహిళా ఉద్యోగుల సంఖ్య పెరుగుతున్న దృష్ట్యా ప్రత్యేకంగా మహిళల కోసం వర్క్ షాపు ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. అనంతరం సింగరేణి సెక్యూరిటీ కార్యాలయం ఆవరణలో నూతనంగా నిర్మించిన గ్రంథాలయాన్ని అధికారులు పరిశీలించారు. ఏరియా ఎస్‌వో టూ జీఎం కవీంద్ర, అధికారులు శ్రీనివాస్, మారుతి, అరుణ్ ప్రసాద్, బాలరాజు పాల్గొన్నారు.

పైలెట్‌కాలనీలో బ్యారక్‌లను పరిశీలిస్తున్న జీఎం రాజేశ్వర్‌రెడ్డి

మృతికి కారణమైన వ్యక్తిపై కేసు నమోదు

వెంకటాపురం(నూగూరు), మార్చి 25 : చిరుతపల్లి గ్రామానికి చెందిన మక్కజొన్న రైతు లేకం మధుకృష్ణ మృతికి కారణమైన వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై కొప్పుల తిరుపతిరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మధుకృష్ణ మక్కజొన్న నిమిత్తం చేసిన అప్పుల బాధతో మనస్తాపంచెంది విత్తనాలు సరఫరా చేసిన హైటెక్ కంపెనీ దళారీని నష్టపరిహారం ఇవ్వమని కోరాడని తెలిపారు. సంబంధిత మధ్యవర్తి మధుకృష్ణను దూషించి నష్టపరిహారం ఇచ్చేది లేదని తేల్చి చెప్పి ఆత్మహత్యకు ప్రేరేపించాడన్నారు. ఈ విషయాన్ని మధుకృష్ణ తన బంధువులకు చెప్పి మనోవేదనకు గురై ఆత్మహత్య చేసుకున్నాడని చెప్పారు. ఇందుకు కారణమైన దళారీపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

విద్యుత్ షాక్‌తో హెల్పర్‌కు తీవ్ర గాయాలు

ములుగురూరల్, మార్చి 25 : విద్యుత్ షాక్‌తో ప్రైవేట్ హెల్పర్‌కు తీవ్ర గాయాలైన ఘటన ములుగు మండలం మాన్‌సింగ్ తండా సమీపంలో జరిగింది. గ్రామస్తుల కథనం ప్రకారం.. రామచంద్రాపురం సబ్‌స్టేషన్ పరిధిలో బానోత్ యాకూబ్ హెల్పర్‌గా పనిచేస్తున్నాడు. మాన్‌సింగ్ తండా సమీపంలో స్తంభంపై మరమ్మత్తులు చేసేందుకు ఎలీసీ తీసుకొని ఎక్కాడు. ఈ క్రమంలో 11కేవీ విద్యుత్ లైన్‌కు కరెంట్ సరఫరా కావడంతో విద్యుత్ షాక్ గురై కింద పడిపోయాడు. తీవ్ర గాయాలైన యాకూబ్‌ను స్థానికులు ములుగు ప్రభుత్వ దవాఖానకు తరలించగా ప్రథమ చికిత్స అనంతరం ఎంజీఎంకు తరలించారు. కాగా, యాకూబ్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది.

దొంగతనం కేసులో ముగ్గురి అరెస్టు

ములుగురూరల్, మార్చి 25 : రెండు వేర్వేరు దొంగతనాల్లో ముగ్గురు దొంగలను అరెస్టు చేసినట్లు ములుగు ఎస్సై వెంకటేశ్వరరావు తెలిపారు. మంగళవారం సాయంత్రం ఆయన దొంగలను అరెస్టు చూపడంతో పాటు వివరాలను వెల్లడించారు. ఈ నెల 15న ములుగు మండలం గట్టమ్మ దేవాలయంలో రూ.52వేల విలువ చేసే వెండి దీపాంతలు రూ.5వేలు, ఇతర వస్తువులను సూర్యాపేటకు చెందిన మంజుల విష్ణు, కోడి నాగమణి మేడారం వెళ్లి వస్తూ దొంగిలించారన్నారు. ఆలయ పూజారి కొత్త సదయ్య ఫిర్యాదు మేరకు సీసీ కెమెరాల ఆధారంగా నిందితులను గుర్తించి పట్టుకున్నట్లు చెప్పారు. అలాగే ఈ నెల 21న మల్లంపల్లి మహంకాళి వైన్స్ షాపులో మంచిర్యాల జిల్లా చెన్నూరుకు చెందిన చింతకింది సతీశ్ రూ.24 వేలు దొంగిలించగా యజమాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి సీసీ కెమెరాల ఆధారంగా గుర్తించి పట్టుకున్నట్లు తెలిపారు. రెండు ఘటనలో నిందితుల నుంచి సొత్తును రికవరీ చేసి రిమాండ్‌కు పంపించినట్లు తెలిపారు.

ఎడ్లబండిని ఢీకొట్టిన ఆటో

తొమ్మిది మందికి గాయాలు

వెంకటాపురం(నూగూరు), మార్చి 25 : నిలిపి ఉన్న ఎడ్లబండిని ఆటో ఢీకొట్టగా తొమ్మిది మందికి గాయాలయ్యాయి. గ్రామస్తుల కథనం ప్రకారం.. చొక్కాల గ్రామానికి చెందిన 15మంది కూలీలు ఆటోలో సూరవీడులో మిర్చి తోటలో పనులు చేసేందుకు వెళ్లారు. తిరిగి ఇంటికి వస్తున్న క్రమంలో పాత్రాపురం గ్రామ శివారులో రోడ్డు పక్కన ఉన్న ఎడ్లబండిని ఆటో ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటో ప్రయాణిస్తున్న ముగ్గురికి తీవ్ర గాయాలు కాగా, ఏడుగురికి స్వల్ప గాయాలయ్యాయి. గాయపడిన వారిని 108 వాహనంలో మండలకేంద్రంలోని ప్రభుత్వ దవాఖానకు తరలించారు. అంగాల సంధ్య, సనుగొండ వెంకటనర్సు, గంపల సుబ్బలక్ష్మిని మెరుగైన చికిత్స నిమిత్తం భద్రాచలం ఏరియా దవాఖానకు రెఫర్ చేశారు.

ధాన్యం కొనుగోలులో జాగ్రత్తలు పాటించాలి

ఏటూరునాగారం, మార్చి 25 : యాసంగి ధాన్యం కొనుగోలులో జాగ్రత్తలు పాటించాలని సివిల్ సప్లయ్ డీఎం, మండల ప్రత్యేకాధికారి రాంపతి, సివిల్ సప్లయ్ అధికారి ఫజల్ హుస్సేన్, జిల్లా కో ఆపరేటివ్ అధికారి సర్దార్ సింగ్ కోరారు. స్థానిక రైతు వేదికలో మంగళవారం ఏటూరునాగారం, వాజేడు, వెంకటాపురం, కన్నాయిగూడెం, మంగపేట మండలాల్లో ధాన్యం కొనుగోలు కోసం ఏర్పాటు చేసే కేంద్రం ఇన్‌చార్జిలకు సేకరణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రాల వద్ద టెంట్లు, కుర్చీలు, తాగునీటి వసతి కల్పించాలన్నారు. ఖాళీ బస్తాలు, మాయిశ్చరైజ్ మిషను ఇతర యంత్ర పరికరాలు తప్పకుండా సమకూర్చుకోవాలని సూచించారు. రికార్డుల నిర్వహణ, టార్పాలిన్ షీట్లు అందుబాటులో పెట్టుకోవడంపై వివరించారు. సమావేశంలో డీపీవో గోవింద్‌చౌహాన్, మండల వ్యవసాయ అధికారి వేణుగోపాల్, డీటీ రాహుల్‌వర్మ, ఐదు మండలాల ఏఈవోలు, ఏఎవోలు, పీపీసీ ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

ఇసుక లారీ డ్రైవర్లు సమయపాలన పాటించాలి

భూపాలపల్లి ఎస్పీ కిరణ్ ఖరే

భూపాలపల్లి రూరల్, మార్చి 25 : రోడ్డు ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ఉండేందుకు ఇసుక లారీ డ్రైవర్లు సమయపాలన పాటించాలని ఎస్పీ కిరణ్ ఖరే మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7 నుంచి 9 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి రాత్రి 7 గంటల వరకు లారీలకు జాతీయ రహదారిపై అనుమతి లేదన్నారు. హోల్డింగ్ పాయింట్స్, చెక్‌పోస్టుల్లో లారీలను నిలుపాలని పేర్కొన్నారు. రేగొండ, కాటారంలో చెక్‌పోస్ట్, హోల్డింగ్ పాయింట్స్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. రేగొండలో ఖాళీ లారీలు, కాటారంలో ఇసుక లోడ్ లారీలు నిలుపుకోవాలని సూచించారు. రోడ్డుపై ఇసుక లారీలు పార్కింగ్ చేయకుండా 24 గంటలు పెట్రోలింగ్ వ్యవస్థను పటిష్టం చేశామన్నారు. డ్రైవర్లు సైతం పోలీసులకు సహకరించాలని ఎస్పీ కోరారు.

కోటంచ హుండీ ఆదాయం రూ.23.84 లక్షలు

రేగొండ, మార్చి 25 : కోటంచ లక్ష్మీనర్సింహస్వామి జాతర హుండీ ఆదాయం రూ .2384 లక్షలు వచ్చినట్లు ఆలయ చైర్మన్ ముల్కనూరి భిక్షపతి, ఈవో మహేశ్‌కుమార్ తెలిపారు. ఆలయంలో ఈనెల 9 నుంచి 16 వరకు జాతర బ్రహ్మోత్సవాలు నిర్వహించారు. జాతర సందర్భంగా ఏర్పాటు చేసిన హుండీలను మంగళవారం ఆలయ ఆవరణంలో లెక్కించారు. ఆదాయం రూ.23,83,940 రాగా, 34 గ్రాముల మిశ్రమ బంగారం, 1.500 కిలోల మిశ్రమ వెండి వచ్చినట్లు వారు తెలిపారు. దేవాదాయశాఖ పర్యవేక్షులు నందం కవిత, ధర్మకర్తలు శ్రీధర్, ఐలయ్య, మల్లయ్య, సాంబయ్య, సిబ్బంది రవీందర్, శ్రావన్ పాల్గొన్నారు.

విద్యుత్ అధికారుల పాలం బాట

మల్హర్, మార్చి 25 : వ్యవసాయ క్షేత్రాలకు విద్యుత్ సరఫరా చేసే క్రమంలో ఏమైనా సమస్యలు తలెత్తితే తమ దృష్టికి తీసుకురావాలని భూపాలపల్లి టెక్నికల్ డీఈ వెంకటేశం సూచించారు. పాలం బాట కార్యక్రమంలో భాగంగా మంగళవారం మల్లారంలోని వ్యవసాయ క్షేత్రాల్లో వారు పర్యటించారు. ఈ సందర్భంగా వంగిన స్తంభాలను సరిచేశారు. వదులుగా ఉన్న విద్యుత్ తీగలను సరిచేశారు. డీఈ మాట్లాడుతూ విద్యుత్ సమస్య వచ్చినప్పుడు సొంతగా మరమ్మతులు చేయొద్దన్నారు. ప్రతి రైతు అధికారికంగా కనెక్షన్ తీసుకుని విద్యుత్ వినియోగించుకోవాలని సూచించారు. ఏడీఈ చైతన్య, సబ్ ఇంజినీర్ ప్రేమలత, మండల ఇన్‌చార్జి ఏఈఈ శేఖర్, తాడిచర్ల లైన్ ఇన్‌స్పెక్టర్ అశోక్. మల్లారం లైన్‌మెన్ నరేశ్, ఏఎల్‌ఎం నరేశ్ పాల్గొన్నారు.

ఎంపీల జీతాలు పెంచడం దుర్మార్గం

కృష్ణకాలనీ, మార్చి 25 : సంఘటిత, అసంఘటిత రంగాల కార్మికుల సంక్షేమాన్ని విస్మరించిన కేంద్ర ప్రభుత్వం ఎంపీజల జీతాలు 24 శాతం పెంచడం దుర్మార్గమని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బందు సాయిలు తప్పు పట్టారు. సిగ్గుమాలిన కేంద్ర ప్రభుత్వం వెంటనే గద్దె దిగాలని డిమాండ్ చేశారు. సోమవారం పార్లమెంటు సమావేశాల సందర్భంగా, ఎంపీల జీతాలు 24శాతం పెంచిన కేంద్రం, డైలీ అలవెన్స్‌లు రూ. 500 నియోజకవర్గం భత్యం పెంపు, మాజీ ఎంపీల పెన్షన్లు రూ. 6వేల పెంపు సరైందికాదన్నారు. దేశంలో కార్మికులకు కనీస వేతనాలు అందక చాలీచాలని బతుకులు వెల్లదీస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా బీజేపీ, ఆర్ఎస్ఎస్ విధానాలను అర్థం చేసుకొని సమరశీల పోరాటాలకు ముందుకు రావాలని ఆయన కార్మికులకు పిలుపునిచ్చారు.

జిల్లా మత్స్యశాఖ అధికారిని సస్పెండ్ చేయాలి

గణపురం, మార్చి 25: ఉచిత చేప పిల్లల పంపిణీలో కాంట్రాక్టర్‌తో కుమ్మక్కై భారీ అవినీతికి పాల్పడిన జిల్లా మత్స్యశాఖ అధికారిని వెంటనే సస్పెండ్ చేయాలని గణపసముద్రం మత్స్య పారిశ్రామిక సహకార సంఘం చైర్మన్ మల్లవేని రాజు డిమాండ్ చేశారు. మంగళవారం సంఘం సభ్యులతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. గణపసముద్రం చెరువుకు 8.30 లక్షల చేప పిల్లలు మంజూరయ్యాయని, జిల్లా మత్స్యశాఖ అధికారి సంబంధిత కాంట్రాక్టర్‌తో మిలాఖత్ అయి కేవలం 1.30 లక్షల చేప పిల్లలు మాత్రమే చెరువులో విడుదల చేశారని, మిగతావి పోయాలని జిల్లా మత్స్యశాఖ అధికారిని అడిగినా స్పందించకుండా తెల్ల కాగితాలపై సంతకాలు చేపిస్తూ పాలకవర్గాన్ని బెదిరింపులకు గురి చేశారని ఆరోపించారు. ఈ విషయాన్ని కలెక్టర్, ఎమ్మెల్యేకు ఆధారాలతో సహా వివరించామన్నారు. వెంటనే ఆయనపై విచారణ జరిపించి చర్యలు తీసుకోవడంతో పాటు డబ్బులను రికవరీ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మాల భద్రయ్య, పోలు నర్సయ్య, సారంగం, గుల్ల భద్రయ్య , రవి పాల్గొన్నారు.

స్థానిక టిప్పర్లకు అవకాశం కల్పించాలి

గణపురం, మార్చి 25 : ఓసీ–త్రీ నుంచి ఇతర ప్రాంతాలకు బొగ్గు తరలించే కాంట్రాక్టర్లు 80 శాతం స్థానిక టిప్పర్ల ద్వారా ఎగుమతి చేయాలని మండల టిప్పర్స్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కొప్పూరి మహేందర్, బాలవేణి రాకేశ్ కోరారు. మంగళవారం వారు మాట్లాడుతూ ఓసీ– త్రీ బొగ్గును ఉప్పల్, రైల్వే, గోదావరిఖని రైల్వే సైడింగ్‌తో పాటు ఇతర ప్రాంతాలకు తరలిస్తూ స్థానిక టిప్పర్ యజమానులకు ఉపాధి లేకుండా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొత్తగా బొగ్గు రవాణా టెండర్లు పొందే కాంట్రాక్టర్లు ఆర్టీవో నిబంధనల ప్రకారం 12 టైర్, 14 టైరు, 16 టిప్పర్లు లోడింగ్ జరిగే విధంగా దృష్టి పెడుతూ పెరిగిన ఖర్చులకు, డ్రైవర్ల జీతాలకు అనుగుణంగా టెండర్లు వేయాలన్నారు. కొందరు కాంట్రాక్టర్లు వారి సొంత వాహనాల కోసం తక్కువ ధరకు టెండర్లు దక్కించుకొని స్థానిక లారీ యజమానుల పొట్టకొడుతున్నారని ఆరోపించారు. తమకు నష్టపరిచేలా వ్యవహరిస్తే ఊరుకునేది లేదనని వారు హెచ్చరించారు.

వాహనదారులకు జరిమానా

ఏటూరునాగారం, మార్చి 25 : పరిమితికి మించి వాహనాల్లో ప్రయాణికులను తరలిస్తున్న వారిని గుర్తించి పెనాల్టీ వేసినట్లు ఎస్సై తాజుద్దీన్ తెలిపారు. మండలకేంద్రంలో మంగళవారం ఆటోలు, టాటా ఏస్ వాహనాలను తనిఖీ చేశారు. నిబంధనలను విరుద్ధంగా కూలీలను ఎక్కించుకుని తరలిస్తున్న వాహన యాజమానులు, డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇచ్చి జరిమాన విధించారు. నిబంధనలకు విరుద్ధంగా వాహనాల్లో వ్యవసాయ కూలీలను తరలిస్తే ఊరుకునేది లేదని ఎస్సై హెచ్చరించారు.

విద్యార్థులు నైపుణ్యతను కలిగి ఉండాలి

ఏటూరునాగారం, మార్చి 25 : విద్యా సంబంధమైన అంశాలతో పాటు ఇతర అంశాల్లో కూడా విద్యార్థులు నైపుణ్యతను కలిగి ఉండాలని గురుకులాల ములుగు రీజినల్ కో ఆర్డినేటర్ హరిసింగ్, నెహ్రూ యువ కేంద్రం డిప్యూటీ డైరెక్టర్ చింతల అన్వేశ్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నెహ్రూ యువ కేంద్రం, మై భారత్ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా స్థాయి యువ ఉత్సవ కార్యక్రమం నిర్వహించగా వారు మాట్లాడారు. విద్యార్థులతో పాటు యువతలో ఉన్న వివిధ రకాల నైపుణ్యాలను వెలికితీసేందుకు పంచ్ ప్రాణ్ అనే అంశాలతో ఏడు విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఏడు విభాగాల్లో గెలుపొందిన విజ